# ఆదివాసీ రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

ఇంద్రవెల్లి : అటవీ రక్షణ పేరుతో ఆదివాసీ గిరిజన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో కందకాలు తవ్వుతూ ఆదివాసీ రైతుల పంటలకు తీవ్ర నష్టం చేశారని, వారికి నష్టపరిహారం అందజేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని గజ్జల లింగాపూర్ గ్రామ శివారులో రైతుల భూముల్లో తవ్విన కందకాలను ప్రజా సంఘాల నాయకులు నేతవాత్ రాందాస్, బాదవాత్ రామరావు, సర్దార్, చవాన్ రాం, దర్శరాంలు పరిశీలించారు. అనంతరం ఇంద్రవెల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక తీసుకొచ్చిన పీసా చట్టాన్ని అటవీ శాఖ అధికారులు తుంగలో తొక్కుతున్నారని, రాజ్యాంగం కల్పించిన సూత్రాలను సైతం వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా నుంచి అటవీ శాఖ మంత్రిగా ఉన్న జోగు రామన్న సైతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే జిల్లా పాలనాధికారి గజ్జల లింగాపూర్ గ్రామాన్ని సందర్శించి రైతుల భూములను పరిశీలించాలని వారు డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## సైబర్ మోసానికి
# రూ.31వేలు పోగొట్టుకున్న యువకుడు



జన్నారం : హలో నేను ఆంధ్రాబ్యాంక్ మేనేజర్‌ను మాట్లాడుతున్న మీ ఏటీఎం కాలపరిమితం ముగిసింది.. పిన్ నెంబరు, ఏటీఎం కార్డు నెంబరు చెబితే వెంటనే పునరుద్ధరిస్తాను. ఇలాంటి ఫోన్ కాల్స్ రావడం సర్వసాధారణమే అయినా మోస పోతున్న వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ఒక పక్క అధికారులు అవగాహన కల్పిస్తున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడడం లేదు. ఇంకేముంటుంది ఆ రెండు నెంబర్లు చెప్పగానే ఖాతాలో ఉన్న సొమ్ము కాస్త ఖాళీ అయిపోతుంది. జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పానుగోటి శ్రీనివాస్ సరిగ్గా ఇలాంటి మోసానికే గురై రూ. 31వేలు పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన జన్నారం ఎస్సై ప్రసాద్ బాధితుడిని తన వెంట తీసుకొని నేరుగా ఆంధ్రాబ్యాంక్‌కే వెళ్లారు. అక్కడ చాలామంది ఖాతాదారులు డబ్బుల కోసం వరుసలో నిలబడి ఉన్నారు. బ్యాంక్ మేనేజర్ సైదయ్య సైతం చాలా బిజీగా కనిపించారు.

దీంతో ఐదు నిమిషాలపాటు అక్కడ ఉన్న ఖాతాదారులతో ఎస్సై మాట్లాడారు. క్షణం తీరిక లేకుండా ఉన్న మేనేజర్‌ను చూడండి ఇంత మంది ఖాతాదారుల పనులను పక్కన పెట్టి ఎక్కడో ఉన్నవారికి ఫోన్ చేసి ఏటీఎం నెంబరు అడగడం అనేది జరగదని చెప్పారు. ఏ బ్యాంక్ మేనేజరు కూడా ఇప్పటి వరకు ఖాతాదారులకు ఫోన్ చేసి ఏటీఎం వివరాలు అడిగిన దాఖలాలు లేవని అలాంటి ఫోన్ కాల్స్ వస్తే ఎలాంటి వివరాలు చెప్పకుండా నేరుగా పోలీస్‌లకుగాని, బ్యాంక్ అధికారులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. దీంతో ఖాతాదారుల్లో కొంత ధైర్యం కనిపించింది. సైబర్ మోసంలో రూ.31వేలు కోల్పోయిన శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై పేర్కొన్నారు.

# మహాలక్ష్మి మండల సమాఖ్యకు ఢిల్లీ కోర్టు నుంచి సమన్లు

చంద్రుగొండ : రాష్ట్రీయ మహిళా కోష్ నిధుల కోసం ఢిల్లీ కోర్టు నుంచి సమన్లు జారీ అయ్యాయని ఐకేపీ ఏపీఎం సంతోష్ చెప్పారు. గతంలో పని చేసిన మహాలక్ష్మి మండల సమాఖ్య అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మ, కోశాధికారి పగడాల కాంతకుమారిని సెప్టెంబరు ఒకటో తారీఖున ఢిల్లీ కోర్టుకు వచ్చి హాజరుకావాలని సమన్లు జారీ చేసినట్లు తెలిపారు. ఢిల్లీలోని రాష్ట్రీయ మహిళా కోష్ నుంచి 2007 జనవరిలో రూ.25 లక్షలు, 2008 ఫిబ్రవరిలో రూ.25 లక్షలు తీసుకున్నారు. ఈ నిధులను మహాలక్ష్మి మండల సమాఖ్య అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మ, కోశాధికారి పగడాల కాంతకుమారి వెళ్లి తీసుకొచ్చారు. అప్పట్లోనే జిల్లాలోని 14 మండలాలకు రూ.7 కోట్లు వచ్చాయి. జీవనోపాధి కోసం తీసుకొచ్చిన ఈ నిధులను చంద్రుగొండ మండలంలోని 32 గ్రామ సమాఖ్యలకు పంపిణీ చేశారు. తీసుకొన్న డబ్బులకు 2013 వరకు అసలు రూ.26.61లక్షలు, వడ్డీగా రూ.13.44లక్షలు చెల్లించారు. ఇంకా రూ.41.52లక్షలు రాష్ట్రీయ మహిళా కోష్‌కు చెల్లించాల్సి ఉంది. గ్రామ సమాఖ్య సభ్యులను డబ్బులు కట్టాలంటే తాము ఎప్పుడో తీర్చేశామని చేతులెత్తారు. దీంతో మిగిలిన డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని రాష్ట్రీయ మహిళా కోష్ ఢిల్లీ కోర్టు ద్వారా సమన్లు జారీ చేశారు. ఈ విషయాన్ని పీఎంఐపీ రామకృష్ణకు తెలియజేశామని ఐకేపీ ఏపీఎం సంతోష్ తెలిపారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మెదక్ : ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు మెదక్‌లో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ఆయా మండలాల్లో ప్రథమస్థానం పొందిన విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో పోటీలు కొనసాగాయి. తెలుగు, ఆంగ్లంలో కవిత (మెదక్), మహేశ్ (కొల్చారం), సరస్వతి (తూప్రాన్), ఉర్దూలో సబాబేగం (నర్సాపూర్), ఫరిమా తబసుం (మెదక్), నేహానాజ్ (మెదక్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారు ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని జిల్లాసైన్స్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు రమణకుమార్, లక్ష్మీప్రసన్న, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పునరాకృతి వివరాలను బహిర్గతం చేయాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా డిమాండ్



జూలూరుపాడు : దుమ్ముగూడెం ప్రాజెక్టు నూతన ఆకృతి ప్రకారం కాలువ నిర్మాణాలు చేపట్టాలని తెరాస ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దానికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. జూలూరుపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ద్వారా ఏ ఏ మండలాలకు సాగునీరందే అవకాశం ఉందో, ఎన్ని వేల ఎకరాలు సాగులోకి వస్తుందో వివరాలను తెలపాలన్నారు. గతంలో జూలూరుపాడు, ఏన్కూరు, కామేపల్లి, చంద్రుగొండ తదితర మండలాలకు కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించగా, ఆ ప్రాజెక్టును కాదని, కొత్తగా పునరాకృతి కల్పిస్తున్నామంటూ చెబుతున్న మంత్రులు, అధికారులు వాటి వివరాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. తెరాస ప్రభుత్వానికి వ్యవసాయ విధానంపై చిత్తశుద్ధి లేదన్నారు. జీఎస్టీ వల్ల రైతులకు ఎరువులు, పురుగు మందుల కొనుగోలుపై భారం పడనుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఏదైనా ప్రజా సంక్షేమం కోరుకోవాలని, భద్రాద్రి కొత్తగూడెంలో సుమారు 30వేల ఇళ్లకు బిల్లులు చెల్లించలేదన్నారు. వీటిని ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందో స్పష్టం చేయాలన్నారు.

హరితహారం కాసుల హారంగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ నెల 8న సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో పోడు సాగుదారుల జిల్లా సదస్సు కొత్తగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు యల్లంకి మధు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్, రాజు, సీతయ్య, స్వరాజ్యరావు పాల్గొన్నారు.

# సకల జనుల అభివృద్ధే లక్ష్యం రాష్ట్ర ప్రణాళికా సంఘం

## ఉపాధ్యక్షుడు ఎస్.నిరంజన్‌రెడ్డి



అంకూరుసు : సకలజనుల అభివృద్ధే తెరాస ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంకూరులో గురువారం నిర్వహించిన గొర్రెల పెంపకందారులకు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎవరూ వూహించని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెల కాపరులను ఆదుకోవాలన్న లక్ష్యంతో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి గ్రామానికి 150- 400 గొర్రెల దాకా కాపరులకు పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు గొర్రెల కాపరులను ఎవరూ పట్టించకోలేదని తెలిపారు. ఈ పథకాన్ని గొర్రెల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 11,844 గొర్రెల యూనిట్లను పంపిణీ చేశామని, రెండో విడతలో ఈ సంఖ్య 23వేల యూనిట్లకు చేరుకుంటుందని తెలిపారు. ప్రజలకు 104 సంచార వాహన సేవల విధంగానే గొర్రెలకూ సంచార వాహనాలను ఏర్పాటు చేసి మంద వద్దకు వచ్చి వైద్యసేవలందిస్తామన్నారు. నట్టలమందు, గాలికుంటు టీకాలను ఏడాదికి నాలుగుసార్లు పంపిణీ చేస్తోందన్నారు. పశు సంతతికి రాష్ట్రంలో మందులు,వైద్యం కొరత ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. అంతకుముందు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గొర్రెలకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చిట్యాల, అంకూరులో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు కల్పన, విష్ణువర్ధన్‌రావు, ఎంపీపీ శంకర్‌నాయక్, సర్పంచుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, వ్యవసాయ మార్కెట్‌యార్డు అధ్యక్షుడు రవికుమార్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు లక్ష్మయ్య, రాజనగరం ఎంపీటీసీ భ్యురాలు విజయలక్ష్మి, కౌన్సిలర్ గట్టుయాదవ్, గృహనిర్మాణ సంస్థ మాజీ రెక్టర్ రాములుయాదవ్, నాయకులు కురుమూర్తియాదవ్, తెరాస నాయకులు పాల్గొన్నారు.

# రూఫ్ బోల్టింగ్ సెక్షన్‌ను ప్రారంభించాలి

కొత్తగూడెం : సెంట్రల్ వర్క్‌షాపులో రూఫ్ బోల్టింగ్ సెక్షన్‌ను తిరిగి ప్రారంభించాలని బీఎంఎస్ డిమాండ్ చేసింది. సెంట్రల్ వర్క్‌షాపులోని సమస్యలపై బీఎంఎస్ భవన్‌లో సమావేశం ఏర్పాటైంది. గుర్తింపు సంఘం ఎన్నికలప్పుడు రూఫ్‌బోల్టింగ్ సెక్షన్‌ను తిరిగి తెరిపిస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకొన్నారని, నేటికీ దాన్ని పట్టించుకోలేదని సమావేశంలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి హామీ ఇస్తున్న ఈ సెక్షన్‌ను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. వెల్డర్లు, హెల్పర్లు, మెకనిస్టులు, కెమిస్టులు, ఫోర్‌మెన్ తదితర ఉద్యోగుల క్యాడర్ స్కీంను జేబీసీసీఐ ఒప్పందం ప్రకారం చెల్లిస్తామని సింగరేణి యాజమాన్యం ఢిల్లీలో మే నెల 8, 9 తేదీల్లో జరిగిన సమావేశంలో అంగీకరించినా ఇప్పటిదాకా అమలు చేయలేదని సమావేశం పేర్కొంది. వెంటనే క్యాడర్ స్కీమును అమలుచేయలని సమావేశం డిమాండ్ చేసింది. బీఎంఎస్ కార్పొరేట కమిటీకి మరికొందరు నాయకులను ఎన్నుకున్నారు. కమిటీకి ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వై.మోహన్‌రావు, సాంబయ్య, సంయుక్త కార్యదర్శులుగా కమల్‌సింగ్, వీరయ్య, కుమారస్వామి ఎన్నికయ్యారు. సమావేశంలో బీఎంఎస్ నాయకులు చింతల సూర్యనారాయణ, పి.మాధవనాయక్, ఎం.శ్రీనివాస్, యాకూబుద్దీన్, బాబూరావు, రాజేశ్వరరావు, ఓదయ్య, కోటి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## డీఈవోగా సరోజినిదేవి నియామకం

మెదక్ : జిల్లావిద్యాశాఖ అధికారిగాసరోజినిదేవి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంతకాలంగా సెలవులో ఉన్న ఆమె విధుల్లో చేరడంతో మెదక్ జిల్లా డీఈవోగా బాధ్యతలు అప్పగించింది. సిద్దిపేట డీఈవో కృష్ణారెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్నారు.

# గుట్కా పాకెట్లు స్వాధీనం

## ఇద్దరు వ్యాపారుల అరెస్టు.. పరారీలో సూత్రధారి



కొత్తగూడెం : కొత్తగూడెం పెద్దబజార్‌లో ఇద్దరు వ్యాపారుల వద్ద రూ.97వేల విలువచేసే గుట్కా పాకెట్లను మూడో పట్టణ ఎస్సై గుంటి శ్రీధర్ స్వాధీనపరచుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌ఛార్జి సీఐ సీహెచ్.శ్రీనివాస్ వివరించారు. పెద్దబజార్‌లో అవస్తి ట్రేడర్స్, సాహిల్ ట్రేడర్స్ పేర్లతో దుకాణాలు కొనసాగిస్తున్న అన్నదమ్ములు సైలేంధర్ అవస్థి, దినేష్ అవస్థిలు పెద్ద ఎత్తున గుట్కా పాకెట్లను దిగుమతి చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్సై గుంటి శ్రీధర్ సిబ్బందితో పక్కపక్కనే ఉన్న ఆ రెండు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద రెండు అంబర్ బ్యాగ్‌లు, గుట్కాలు సఫారీ, ఠాగూర్, త్రీస్టార్ పాకెట్లతో ఉన్న అయిదు బ్యాగులు కనిపించాయి. వాటిని స్వాధీనపరచుకుని ఆ ఇద్దరిని విచారించడంతో వారికి లక్ష్మీదేవిపల్లి పంచాయతీ శ్రీనగర్‌కాలనీకి చెందిన ఐటీసీ సతీష్ అనే వ్యక్తి సరఫరా చేసినట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం అతను పరారీలో ఉన్నట్టు, సతీష్‌ను అదుపులోకి తీసుకుంటే ఎక్కడి నుంచి దిగుమతి చేస్తున్నారనే విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. పూర్తిస్థా యిలో గుట్కా వ్యాపారాన్ని నిలువరించాలనే ఎస్పీ అంబర్‌కిషోర్ ఆదేశాల మేరకు నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ వివరించారు. ఎస్సై శ్రీధర్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్టు



కందనూలు : నాగర్‌కర్నూల్ పట్టణంలో ఆదివారం సాయంత్రం ఓ తేనీటి హోటల్ వద్ద జరిగిన ఘర్షణలో నందివడ్డెమాన్‌కు చెందిన ఇప్పటి స్వామి (21) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. అందుకు కారకులైన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ చల్లా ప్రవీణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న ఉదయం బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్‌కు చెందిన కొందరు యువకులు పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినేనిపల్లి మైసమ్మ ఆలయానికి వెళ్లి సాయంత్రం తిరుగు పయనంలో పట్టణంలోని ఓ తేనీటి హోటల్ వద్ద ఆగి టీ తాగుతుండగా అదే గ్రామానికి చెందిన ఓ యువకునికి పీజీ అర్హత పరీక్షలో ర్యాంకు రావడంతో ఉత్సాహంగా కేరింతలు కొట్టడంతో అక్కడే ఉన్న పట్టణానికి చెందిన శివ, ఈశ్వర్, రషీద్, ఫెరోజ్, శ్రీధర్ అనే యువకులతో పాటు సందీప్ అనే బాలుడు వారిపై దాడి చేశారు. ఈ దాడిలో ఇప్పటి స్వామిని బలంగా కొట్టడంతో కొద్దిసేపటికే మృతిచెందాడు. నిందితులు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని వారి చరవాణిలను పరిశీలనలో పెట్టి అరెస్టు చేసినట్లు వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చడంతో పాటు వారిపై రౌడీషీటర్ కేసునమోదు చేసినట్లు వివరించారు. కేసును ఛేదించిన సిబ్బంది శంకర్, ఆదిత్య, బాలయ్య తదితరులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ రాంబాబు, పట్టణ ఎస్సైలు, పురుషోత్తం, మోహన్‌రెడ్డి, తెలకపల్లి ఎస్సై కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# జలాశయాల బాధ్యత ప్రతీ మత్స్యకారుడిది

## కేరళ రాష్ట్ర మత్స్య పరిశోధకుడు డాక్టర్ బాలగోపినాథ్



కూసుమంచి : సహజసిద్ధంగా మత్స్య సంపదను అందించే జలాశయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ మత్స్యకారుడిపై ఉందని కేరళ రాష్ట్రంలోని కేరళ యూనివర్సిటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఓవెన్ స్టడీస్ పరిశోధకుడు డాక్టర్ దివి బాలగోపీనాథ్ మత్స్యకారులకు సూచించారు. పీవీ నర్సింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధీనంలోని పాలేరు మత్స్యపరిశోధన కేంద్రంలో వైరా జలాశయం మత్స్యకారులకు చేపట్టిన నైపుణ్య శిక్షణ రెండో రోజు జరిగింది. రెండోరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరైన గోపీనాథ్ మాట్లాడుతూ మానవుడితో పాటు అనేక జీవరాశుల మనుగడ జలాశయాలపైనే ఆధారపడి ఉందన్నారు. జలాశయాలతో వ్యవసాయరంగం, రైతులతోపాటు మత్స్య సంపద, మత్స్యకారుల మనుగడ ఆధారపడి ఉందన్నారు. జలాశయాల్లో చేపలవేట విచ్చలవిడిగా నిర్వహించవద్దని ఆయన చెప్పారు. మత్స్యకారులు తమకు లభించిందే చేప అనే దృక్పథంతో చేపలను వేటాడి వాటి మనుగడను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిచేపలు, పిల్లచేపలు వేటలో లభించినా జలాశయాల్లోనే వదిలేయాలని సూచించారు.

తల్లిచేపల ద్వారా సహజ సిద్ధమైన పిల్లల ఉత్పత్తి జరిగి మరుసటి సంవత్సరానికి చేపల సంఖ్య లక్షల్లో చేరుతుందన్నారు. జూన్, జులై, ఆగస్టు నెలల్లో చేపలు గుడ్లు విడిచే కాలం కావడంతో ఈకాలంలో చేపల వేటను నిలిపివేయాలని సూచించారు. వాటిని పునరుత్పత్తి కోసం వదిలేయడం ద్వారా తాత్కాలిక నష్టం జరిగినా భవిష్యత్తు ఉజ్వలం అవుతుందన్నారు. కేరళతోపాటు అనేక రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ఈవిధానం అమలుపరుస్తున్నారని సూచించారు. పిల్ల చేపలను వదిలేయడం ద్వారా మూడు, నాలుగు నెలల్లో నాలుగురెట్లు పెరిగి మరింత ఆదాయాన్ని సమకూర్చుతాయన్నారు. మరో శిక్షకుడిగా హాజరైన వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఇ.నెహ్రూ మాట్లాడుతూ జలాశయాల్లో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు శ్యాంప్రసాద్, జి.రవి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఈనెల 10న ప్రగతి సమావేశం

- హైదరాబాద్‌లో కేటీఆర్‌తో భేటీ
- అభివృద్ధి పనులపై చర్చ
- ప్రతిపాదనల తయారీలో నిమగ్నం
- సమావేశానికి వెళ్లనున్న ఎమ్మెల్యే, మేయర్



హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఈ నెల 10వ తేదీన పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌తో జరిగే సమావేశానికి అధికార యంత్రాగం సిద్ధం అవుతుంది. ఈ సమావేశానికి అర్బన్ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, నగర మేయర్ ఆకుల సుజాత, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, ఎస్ఈ బాలముని వెళ న్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు గత కొన్ని రోజుల నుంచి అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నగరంలో అయిదు జోన్లలో ఏఈలు చెడిపోయిన రోడ్లను పరిశీలించారు. ఏ రోడ్డు ఎన్ని కిలోమీటర్ల పరిధిలో చెడిపోయిందో వివరాలు సేకరించారు. స్థానికంగా ఉండే కార్పొరేటర్లతో కలిసి రోడ్లను బాగు చేసేందుకు అంచనాలను తయారు చేశారు. పలు ప్రాంతాల్లో ఏఈలు పర్యటించారు. మురుగు కాలువలు ఎక్కడ అవసరం ఉంటుందో కార్పొరేటర్లను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

అన్నింటిపై చర్చ

పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఈ మధ్య కాలంలో నగరానికి వచ్చిన సందర్భంగా జరిగిన సమావేశంలో చర్చించిన వివరాలపై కూడా మరోసారి చర్చించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమల నివేదికలను సిద్ధం చేసు కుంటున్నారు. దీంతో పాటు రూ.100 కోట్లతో చేపట్టి పనుల వివరాలతో నివేదిక తయారుచేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సమావేశం అయి నగరంలో చేపట్టాల్సిన పనుల గురించి ప్రతిపాదనలు తయారు చేశారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, మార్కెట్ల ఆధునికీకరణ, ఉద్యానాల ఏర్పాటు, డంపింగ్ యార్డు, జంతు వధశాల అభివృద్ధి, అసంపూర్తిగా నిలిచిపోయిన మున్సిపల్ భవనం నిర్మాణం, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం ఆధునికీకరణ వంటి పనుల వివరాలను కేటీఆర్ ముందు ఉంచనున్నారు. వీటితో పాటు రాబోయే రోజుల్లో చేపట్టే అభివృద్ధి గురించి చర్చించనున్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా గురువారం సాయంత్రం నగరానికి వచ్చారు. వచ్చి రాగానే తన కార్యాలయంలో నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో అంతర్గత సమావేశం అయ్యారు. ఎస్ఈ బాలమునితో పాటు ఏఈలు సమావేశంలో ఉన్నట్లు తెలిసింది. ఈ నెల 10వ తేదీన కేటీఆర్‌తో జరిగే సమావేశంలో చర్చించే అంశాలతో పాటు అభివృద్ధి పనుల ప్రణాళికలపై ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఇచ్చిన రూ.100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రణాళికపై చర్చించారు.

### ధ్రువలో ఇంజినీరింగ్ విద్యపై

## అంతర్జాతీయ సదస్సు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం తుఫ్రాన్‌పేటలోని ధ్రువ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీరింగ్ విద్యపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ఛైర్మన్ కొత్త పర్వత్‌రెడ్డి, ప్రిన్సిపల్ బి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ...

నైజిరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక దేశాలకు చెందిన ఒక్కో ప్రతినిధులు హాజరై ఇంజినీరింగ్ లోని ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్‌తో పాటు సివిల్, మేనేజ్‌మెంట్ విద్యపై చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సును జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోవర్ధన్ ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా నైజిరియాకు చెందిన ప్రొఫెసర్ నజీబ్‌ఉమ హాజరవుతారని పేర్కొన్నారు. ముగింపు సభలో జెఎన్‌టీయు డైరక్టర్ డాక్టర్ ఎం.మంజూర్ హుస్సెన్ ప్రసంగిస్తారని తెలిపారు.

గ్రాడ్యుయేషన్ డేను పురస్కరించుకొని 2012-17 వరకు ధ్రువ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు సాయంత్రం ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు.

### నిర్మల హృదయలో స్వాగత వేడుకలు

నిజామాబాద్: ఆకట్టుకునే నృత్యాలు..కేరింతలు..చప్పట్లతో నిర్మల హృదయ కళాశాల మారుమ్రోగింది. నగరంలోని సుభాష్‌నగర్‌లో గల జూనియర్ కళాశాలలో స్వాగత వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎక్సైజ్ ఎస్సై సింధు హాజరై మాట్లాడారు. పోటీ ప్రపంచంలో కష్టపడితేనే విజయం సాధిస్తారన్నారు. ప్రస్తుతం అన్నిరంగాల్లో మహిళలు ముందు టున్నారని గుర్తుచేశారు. మంచి మార్కులతో ఉజ్వల భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలన్నారు

### విషాహారం తిని

## 20 గొర్రెల మృతి

మోర్తాడ్ : మోర్తాడ్‌లో విషపూరిత గ్రాసం తిని 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాధితుడు సిరాంపురం నడ్పి గంగారాం కథనం ప్రకారం ... గొర్రెలను ఉదయం మేత కోసం ఇద్దరు పనివాళ్లు పొలాలకు తీసుకు వెళ్లారు. పొలాల్లో కలుపు నివారణకు వేసిన గడ్డి మందుతో కూడిన గ్రాసాన్ని తిన్న గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న పశువైద్య సిబ్బంది అక్కడికి చేరుకొని కొన్ని గొర్రెలకు వైద్యసదుపాయం అందించి బతికించారు. అప్పటికే 20 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ. 2లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

వైద్యుడు లేడు

మోర్తాడ్‌లో 20 గొర్రెలు చనిపోయి, మరికొన్ని మృత్యు ముఖంలో కొట్టుమిట్టాడుతుండగా మోర్తాడ్ ప్రభుత్వ పశు వైద్యాధికారి జాడ లేదు. పశువైద్యాశాలలోని ఆటెండర్, ఇద్దరు సిబ్బంది, ప్రైవేటువైద్యులు సకాలంలో వైద్యం అందించి కాపాడారు. ఆస్పత్రిలో ఉన్న కొన్ని విష నివారణ మందులు తీసుకు వచ్చి చికిత్స చేశారు. దవాఖానాలో మందుల కొరతతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

## సేవ చేయడమే వాసవి క్లబ్ లక్ష్యం

మరిపెడ : సేవచేయడమే వాసవిక్లబ్ లక్ష్యమని వాసవిక్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆదికేశవన్ అన్నారు. మరిపెడ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో గుండెపుడి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతిమాత, మహాత్మాగాంధీ, విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో 1800 క్లబ్బుల్లో 90 వేల మంది సభ్యులతో వాసవిక్లబ్ కోట్లాది ప్రజానికానికి సేవలందించి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా సేవా అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. పేదవారికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. సహృద్భావ పర్యటనలో భాగంగా మరిపెడకు వచ్చినట్లు చెప్పారు. గుండెపుడి గ్రామంలో సరస్వతి మాత, మహాత్ముని విగ్రహాలను ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మేనేజర్లు గ్రామానికి చెందిన శ్రీరాం తారకం, శ్రీనివాస్, సత్యనారాయణలను ఆయన అభినందించారు. మరిపెడ వాసవి, వనితాక్లబ్ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా స్థానిక దంతవైద్యుడు తల్లాడ అర్జున్ ఏర్పాటు చేసిన ఉచిత దంతవైద్య శిభిరాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వైశ్యులు సేవాబావం కల్గినవారని సమా జానికి తెలుసన్నారు. అనంతరం మాకుల వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్లబ్ చేపట్టిన సేవాకార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ జిల్లా కార్యవర్గంతో పాటు మరిపెడ వాసవిక్లబ్ అధ్యక్షుడు వంగపల్లి భరత్‌కుమార్, డిప్యూటి గవర్నర్ సురేష్, వనితాక్లబ్ కార్యవర్గం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపకానికి వాడుతున్న సేంద్రియ ఎరువులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో చెన్నారావుపేటకు చెందిన రైతులు టేకు మొక్కల కోసం రాగా జాప్యం చేయకుండా మొక్కలను ఇవ్వా లని స్థానిక సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ ఆర్వోలు రాజేశ్వర్, వసీం, బీట్ అధికారులు గౌసుద్దిన్, మోహన్, నవీన్, ఆర్ఐ నవీన్ తదితరులు ఉన్నారు.

### ఏకీకృత సర్వీసులపై

## గెజిట్ చట్టవిరుద్ధం

కొత్తగూడెం : ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసుల విషయంలో జారీచేసిన గెజిట్ చట్టవిరుద్ధమని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) రాష్ట్ర కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెం బాబుక్యాంప్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుల జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్రామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 73, 74 రాజ్యాంగ సవరణలకు విరుద్ధంగా పంచాయతీరాజ్ వ్యవస్థ స్ఫూర్తికి భిన్నంగా, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను లోకల్ క్యాడర్ పోస్టులుగా పేర్కొంటూ రాష్ట్రపతి గెజిట్‌లో జారీ చేయడం చట్టవిరుద్ధమన్నారు.

పార్లమెంట్ ఆమో దించకుండా, నేరుగా రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం తగదని, ఈ విషయంలో న్యాయస్థానాలను ఆశ్ర యించ నున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు వీవీ.రామారావు, వసంతలక్ష్మి, తబితా సంధ్యారాణి, నాగయ్య, మంగపతిరావు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పునరాకృతి వివరాలను బహిర్గతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా డిమాండ్



జూలూరుపాడు : దుమ్ముగూడెం ప్రాజెక్టు నూతన ఆకృతి ప్రకారం కాలువ నిర్మాణాలు చేపట్టాలని తెరాస ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దానికి సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. జూలూరుపాడులో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ద్వారా ఏ ఏ మండలాలకు సాగునీరందే అవకాశం ఉందో, ఎన్ని వేల ఎకరాలు సాగులోకి వస్తుందో వివరాలను తెలపాలన్నారు. గతంలో జూలూరుపాడు, ఏన్కూరు, కామేపల్లి, చంద్రుగొండ తదితర మండలాలకు కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించగా, ఆ ప్రాజెక్టును కాదని, కొత్తగా పునరాకృతి కల్పిస్తున్నామంటూ చెబుతున్న మంత్రులు, అధికారులు వాటి వివరాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. తెరాస ప్రభుత్వానికి వ్యవసాయ విధా నంపై చిత్తశుద్ధి లేదన్నారు. జీఎస్టీ వల్ల రైతులకు ఎరువులు, పురుగుమందుల కొనుగోలుపై భారం పడనుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఏదైనా ప్రజా సంక్షేమం కోరుకోవాలని, భద్రాద్రి కొత్తగూడెంలో సుమారు 30 వేల ఇళ్లకు బిల్లులు చెల్లించలేదన్నారు. వీటిని ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందో స్పష్టం చేయాలన్నారు. హరితహారం కాసుల హారంగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ నెల 8న సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో పోడు సాగుదారుల జిల్లా సదస్సు కొత్తగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు యల్లంకి మధు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్, రాజు, సీతయ్య, స్వరాజ్యరావు పాల్గొన్నారు.

## రెండు లారీల పీడీఎస్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు : పేదలకు అందాల్సిన రెండు లారీల పీడీఎస్ (రేషన్ బియ్యాన్ని) బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న దళారీముఠాను గుర్రంపోడు పోలీసులు పట్టుకున్నారు. గుర్రంపోడు మండలం మొసంగి వద్ద ఒకలారీని పట్టుకోగా సాయంత్రం హాలియా వద్ద రెండో లారీని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... గుర్రంపోడు మండలం మొసంగి వద్ద గురువారం ఉదయం అక్రమంగా తరలుతున్న బియ్యం లారీని ఎస్సై క్రాంతికుమార్ తన సిబ్బందితో వెళ్లి పీడీఎస్ బియ్యంగా గుర్తించి లారీ (ఏపీ 07 వె% 4478)ని స్వాధీనం చేసుకున్నారు. అందులో 148 బస్తాల బియ్యం (74 క్వింటాళ్ల) రవాణా జరుగుతోంది. పట్టుబడిన వ్యక్తులు వెల్లడించిన వివరాల ప్రకారం హాలియాలోని ఓ రైస్‌మిల్‌కు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దీంతో ఎస్సై క్రాంతికుమార్ తన సిబ్బందితో హాలియాలోని ఆ రైస్‌మిల్‌కు వెళ్లి తనిఖీ చేయగా అక్కడ 420 బస్తాల నూకల బియ్యం (210 క్వింటాళ్లు) ఉన్న లారీ (టీఎన్ 29 బివె% 9843)ని గుర్తించారు. అందులో నూకలుగా మార్చిన బియ్యం ఉన్నట్లు గుర్తించి మిల్లు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పీఏపల్లికి చెందిన ఓ డీలరు, మరో వ్యాపారి, దళారి ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ దందా విషయంపై పోలీసులు మరిన్ని విషయాలను లాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్ : ఈ నెల 8 జిల్లా వ్యాప్తంగా సుప్రీంకోర్టు అదేశాల మేరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, దీనిని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి కె.సుజన తెలిపారు. తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌కు విస్తృత ఏర్పాట్లు చేశామని, దీనికోసం ఇప్పడి వరకు పోలీసులు, బీమా కంపెనీ అధికారులు, న్యాయవాదులు, లీగల్ క్లినిక్, న్యాయసేవా సంస్థ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించామని వెల్లడించారు. ఈసారి కూడా క్రిమినల్, సివిల్, బీమా కంపెనీలు, బ్యాంక్ కేసులు, ఎక్సైజ్, మున్సిపల్, చెక్, ఇతర కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. నిజామాబాద్ నగరంలో ఐదు బెంచ్‌లను, అలాగే ప్రతి కోర్టులో వివిధ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి సూర్యచంద్రకళ పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువులు కల్తీ చేస్తే కఠిన చర్యలు

వరంగల్ : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిత్యావసర వస్తువుల కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటామని పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. కమిషనర్ కార్యాలయంలో ఆయన కల్తీ వస్తువుల నియంత్రణ, తదితర అంశాలపై పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ..

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే వస్తువుల కల్తీని పూర్తిగా నిరోదించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ వస్తువు ఎక్కడ కల్తీ అవుతుందో తెలుసుకోవాలని సూచించారు. గతంలో కల్తీలకు పాల్పడిన వారి వివరాలను పోలీసుస్టేషన్ల వారీగా సేకరించాలన్నారు. సమాచారం సేకరించిన అనంతరం గత నిందితులు ప్రస్తుతం ఏం చేస్తున్నారో తెలుసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి నిత్యావసర సరుకులు ఇతర వస్తువులు వస్తున్నాయని దీనిపై నిఘా పెంచాలని సూచించారు. ఇందుకోసం ఇతర ప్రభుత్వ అధికారుల సాయం తీసుకోవాలని సూచించారు.

త్యావసర సరుకుల కల్తీ కేసులు నమోదు చేసే సమయంలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అవసరమైతే వస్తువులను ల్యాబ్‌కు పంపించి పరీక్షించాలన్నారు. సమావేశంలో డీసీపీలు ఇస్మాయిల్, వెంకన్న, ఏసీపీలు సుధీంద్ర, ఛైతన్యకుమార్, కె.మురళీధర్, పద్మనాభరెడ్డి, జనార్దన్, శోభన్‌కుమార్, సంజీవరావు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ కార్యదర్శిగా పవన్




నిజామాబాద్ : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడల నిర్వహణ కార్యదర్శిగా బి.పవన్‌కుమార్ ఏకగ్రీవంగా నామినేట్ అయ్యారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని తిలక్‌గార్డెన్‌లోని కొత్త అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో 2016-17 సంవత్సరానికి సంబంధించిన క్రీడా నివేదికను గత క్రీడల నిర్వహణ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి చదివి వినిపించారు. దీంతో సభ్యులు చప్పట్లతో ఆమోదం తెలిపారు. ఆ పిమ్మట 2017-18, 2018-19 సంవత్సరానికి నూతన నిర్వహణ కార్యదర్శి సీనియర్ వ్యాయామ అధ్యాపకుల నుంచి ప్రతి పాదనలు తీసుకున్నారు. సీనియారిటీ ప్రతి పాదికన బి.పవన్ కుమార్ నిర్వహణ కార్యదర్శికి తన ప్రతిపాదనను అందించంగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పవన్‌కుమార్ వేల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ ప్రతినిధిగా ఏడీ లాయక్‌అలీఖాన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పేట అధ్యక్షులు అనిల్, కార్యదర్శి విద్యా సాగర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సభ్యులు రాజ్‌కుమార్, గంగాధర్, శారద, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా క్రీడల నిర్వహణ

-బి.పవన్‌కుమార్, కార్యదర్శి

జిల్లాలో పాఠశాలల క్రీడల నిర్వహణను ప్రణాళికబద్ధంగా చేపడతాను. సమర్థవంతంగా నిర్వహించి జిల్లాకు విజయాలను అందించేందుకు కృషి చేస్తాను. అందరి సలహాలను తీసుకొని ముందుకు సాగుతాను.

హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ సమావేశం శుక్రవారం రోజునే ఉన్నందున రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణకు ముందుకు వచ్చి లిఖిత పూర్వకంగా అందజేస్తే టోర్నీని జిల్లాకు కేటాయించేలా ప్రయత్నిస్తా.

## అధిక దిగుబడులు సాధించేలా అవగాహన కల్పించాలి: కలెక్టర్ ఆమ్రపాలి

వరంగల్ : శాస్త్రీయ పద్ధతులలో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధించేలా రైతులకు శిక్షణ, అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఆత్మ గవర్నింగ్ బాడీ(జీబీ) సమావేశంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఆత్మ కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించి రూ.64.54లక్షలతో ఆత్మ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు అంతర్రాష్ట్ర, ఇతర జిల్లాల్లో క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేసి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా శిక్షణ ఇచ్చి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన సెరీకల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్, డైరీ పరిశ్రమలలో శాస్త్రీయ పద్ధతులు అనసరించేలా చూడాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించాలని కోరారు. పాలిహౌస్ ద్వారా వ్యవసాయ అనుబంధ శాఖల్లో కార్యక్రమాలు చేపట్టడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. వరంగల్ నగరంలో పూలు, కూరగాయలకు అధిక డిమాండ్ ఉన్నందున వ్యవసాయంతోపాటు పండ్లు, కూరగాయలు, పూల పంటలు వేసేలా రైతులకు అవగాహన కలిగించాలని కోరారు. ఫ్లోరీకల్చర్(పూలపంటల) రైతులకు జిల్లా, రాష్ట్రస్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్ ఆత్మ కార్యాచరణ గురించి వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో విజయ్‌గోపాల్, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు ఉషారాణి, హార్టికల్చర్ అధికారి సునీత, పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు రాజ్‌గోపాల్‌రావు, పులిసంపత్‌కుమార్, రమాదేవి, దేవేంద్ర, ఎన్జీవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 64.54 లక్షలతో ఆత్మ ప్రాజెక్టుకు ఆమోదం

